పెండ్లి ఇంట విషాదం

● కార్డులు పంచేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో కాబోయే వరుడు మృతి

శివకుమార్(ఫైల్)

నార్కట్‌పల్లి/మోత్కూరు, ఫిబ్రవరి 11: వారం రోజుల్లో ఆ ఇంట పెండ్లి బాజా మోగాల్సి ఉంది. కానీ, ఇంతలోనే విషాదం చోటుచేసుకుంది. మరో ఏడు రోజుల్లో పెండ్లి కొడుకు కావాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దాంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు శివారులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన వ్యాపారి సకినాల వెంకటయ్య చిన్న కుమారుడు శివకుమార్(25)కు ఇటీవల పెండ్లి నిశ్చయమైంది. ఈ నెల 18న వివాహం ఉండగా, తన మిత్రుడు అప్పిశెట్టి నితిన్‌తో కలిసి పెండ్లి పత్రికలను పంచేందుకు వెళ్లి శనివారం రాత్రి స్వగ్రామం తిరిగి వస్తుండగా అమ్మనబోలు సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో శివకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని కామినేని దవాఖానకు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. నితిన్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడి సోదరుడు సకినాల సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. విషాద ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో శివ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

చికిత్స పొందుతూ రోగి మృతి

● ఏరియా ఆస్పత్రి ఎదుట రోగి బంధువుల ధర్నా

ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న రోగి బంధువులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 11 : చికిత్స పొందుతూ రోగి మృతిచెందగా బంధువులు ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించిన సంఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. రోగి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కన్నెబోయిన సోమమ్మ(63)కు ఉదయం విరోచనాలు కావడంతో 8 గంటల సమయంలో ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు గ్లూకోజ్ పెట్టి ఇంజక్షన్ వేశారు. ఇంజక్షన్ వేసిన వెంటనే గుండెలో మంట అంటూ అరవడంతో కంగారుపడిన కుటుంబసభ్యులు ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించారు. కొద్ది సేపటికే సోమమ్మ మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఇంజక్షన్ వికటించి సోమమ్మ మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బంధువులతో కలిసి ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి వచ్చి రోగి బంధువులతో మాట్లాడి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై వైద్యులను వివరణ కోరగా.. విరేచనాలు కావడంతో బీపీ పూర్తిగా పడిపోయిందని, ఆమెకు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయని, దీనికి తోడు పెద్ద వయసు కావడంతో గుండెపోటు కూడా వచ్చి ఉండవచ్చని, వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని పేర్కొన్నారు.

భూ తగాదాలో మహిళ ఆత్మహత్యాయత్నం

● పోలీస్‌స్టేషన్ ఎదుట చెయ్యి కోసుకొని అఘాయిత్యం..

బ్లేడ్‌తో చెయ్యి కట్ చేసుకున్న జయ

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి11 : తన భూ సమస్యను పరిష్కరించడం లేదని ఓ మహిళ రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జప్తివీరప్పగూడేనికి చెందిన కడారి జయ తన వివాహ సమయంలో తండ్రి కడారి రామనర్సయ్య వివాహ కానుకగా ఇంటి స్థలం ఇచ్చాడు. కాగా ఇటీవల ఆ స్థలాన్ని ఆమెకు తెలియకుండా తండ్రి అమ్ముకునే ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న కూతురు స్థల విక్రయాన్ని అడ్డుకుంది. ఈ విషయంలో తండ్రీకూతుళ్ల మధ్య వివాదం తలెత్తి ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఎస్ఐ సతీశ్ వర్మ ఇంటి స్థలం విషయంపై ఇరువురు చర్చించుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్ వెలుపల పెద్దమనుషుల సమక్షంలో సయోధ్య కుదుర్చుకునే క్రమంలో తనకు న్యాయం జరుగడం లేదని కూతురు జయ బ్లేడ్‌తో చెయ్యి కట్ చేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు గమనించి అమెను చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా.. స్థల వివాదం తమ పోలీస్ స్టేషన్ పరిధిలో లేదని తెలిపారు.

కోటమైసమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

కోటమైసమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

నిడమనూరు, ఫిబ్రవరి 11 : మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం శివారులోని కోటమైసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు.

ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల వాహనాల రద్దీతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మంగళ, గురు, ఆదివారాల్లో భక్తులు జిల్లా నలుమూలల నుంచి తరలివస్తున్నందున ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రాష్ట్ర కళావేదిక నియోజకవర్గ ఇన్‌చార్జిగా శ్రీను

శ్రీను

త్రిపురారం, ఫిబ్రవరి 11: రాష్ట్ర కళావేదిక నియోజకవర్గ ఇన్‌చార్జిగా త్రిపురారం మండలం మాటూరు గ్రామానికి చెందిన కల కొండ శ్రీను(బొట్టు శ్రీను) నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ ఆదివారం శ్రీనుకు నియామకపత్రం అందచేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌కు, జిల్లా అధ్యక్షుడు పందిరి సైదులుకు, తోటి కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు సంపత్ ఎంపిక

సంపత్

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 11 : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు మండల కేంద్రానికి చెందిన పిట్టల సంపత్ ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు సంపత్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంపత్‌ను గ్రామస్తులు, క్రీడాకారులు అభినందించారు.

మహిళ లకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి

● మహిళల్లో నైపుణ్యాభివృద్ధికి రూ.30 కోట్ల కేటాయింపు

● చేతి వృత్తుల ప్రదర్శనలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి

టీటీడీసీలో స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన కలెక్టర్ హరిచందన

నీలగిరి, ఫిబ్రవరి 11 : మహిళలు కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉండేందుకు వారికి ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో మహిళలు వివిధ వ్యర్థాలతో రూపొందించిన చేతి ఉత్పత్తుల శిక్షణ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబ అవసరాలకు పురుషుల సంపాదన ఒక్కటే సరిపోదని, మహిళలు కూడా ఆదాయం పొందే మార్గాలు కల్పించాల్సి ఉందన్నారు. పేదలకు అండగా నిలిచి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వివిధ వ్యర్థాలతో ఉత్పత్తుల తయారీలో వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు వీలుందన్నారు. నిరుద్యోగ యువతకు అన్ని రకాల శిక్షణ కార్యక్రమాలు చేపట్టి వారిలో నైపుణ్యాలు పెంచేందుకు రూ.30 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలోని స్వయం సహాయక మహిళలకు వివిధ వస్తువుల తయారీలో నైపుణ్య అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు దాతల సహకారం పొంది ఆదాయ వనరులను పెంపొందించుకోవాలన్నారు. వ్యవసాయ వ్యర్థాలతో టీ కప్పులు తయారుచేసే మిషన్‌కు అవసరమైన రూ.15 లక్షలు తన సొంత నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఉచిత బస్సు ప్రయాణం ఇప్పటి వరకు 17 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నట్లు తెలిపారు. మరో పది, పదిహేను రోజుల్లో 500 గ్యాస్, రెండు నెలల్లో గృహలక్ష్మి పథకం అమల్లోకి రానుందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలను డీఆర్‌డీఓ పీడీ కాలిందిని వివరించారు. కలెక్టర్ హరి చందన, అదనపు కలెక్టర్ హెచ్‌కే పాటిల్, ఆర్డీఓ రవి, మెప్మా పీడీ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యం

నీలగిరి : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన మొట్టమొదటి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నల్లగొండ జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు రెండు నెలల్లో శ్రీశైలం సొరంగ పనులు, బి.వెల్లంల ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ స్పష్టమైన అంకెలతో రాబడి, ఖర్చులతో వివరిస్తూ అన్ని రంగాలకు ప్రాధాన్యమిచ్చి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమానికి 53 వేల కోట్లు కేటాయించడంతోపాటు ప్రాథమిక విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు కూడా నిధులు కేటాయించినట్లు చెప్పారు. ప్రతి మండల కేంద్రంలో పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు రూ.500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. త్వరలో మెగా డీఎస్సీ ప్రకటిస్తామన్నారు. తన శాఖలో రూ.4768 కోట్లు కేటాయించి ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లు వేస్తామని, వచ్చే బడ్జెట్‌లో రూ.14 వేల కోట్లు ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా నిధులు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

చలో నల్లగొండను విజయవంతం చేయాలి

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్

మర్రిగూడ, ఫిబ్రవరి 11 : కృష్ణా ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తోట కూరి శంకర్‌యాదవ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

చిట్యాల : కృష్ణా జలాల నిర్వహణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించటాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తలపెట్టిన సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు తుమ్మల నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, ప్రజాపతినిధులు పెద్ద సంఖ్యలో సభకు తరలిరావాలని కోరారు.

కట్టంగూర్ ఎస్ఐగా శ్రీను బాధ్యతల స్వీకరణ

కట్టంగూర్, ఫిబ్రవరి11 : కట్టంగూర్ ఎస్ఐగా ఎస్.శ్రీను ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన దూదిరాజు తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీను ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నేరాల అదుపునకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

హాలియా ఎస్‌గా సతీశ్‌రెడ్డి ..

హాలియా : హాలియా ఎస్ఐగా సతీశ్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన శోభన్ బాబు దేవరకొండకు బదిలిపై వెళ్లగా నల్లగొండ వీఆర్‌లో ఉన్న సతీశ్‌రెడ్డి బదిలీపై హాలియాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం

నకిరేకల్, ఫిబ్రవరి 11 : నకిరేకల్ పట్టణానికి చెందిన మహ్మద్ ఫసియొద్దీన్ కూతురు అయేషా ఫాతిమా(14నెలలు)కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. చికిత్సకు సరిపడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నామని, తమను ఆదుకోవాలని లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారిని సంప్రదించారు. దాంతో ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం పట్టణంలోని మినీస్టేడియంలో ఫసియొద్దీన్‌కు రూ.22,410 ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు బ్రహ్మదేవర నరేశ్, కృష్ణప్రసాద్, మిస్కిన్, మాజీద్, ఫయాజ్, అజీమ్, వెంకటప్రసాద్, హరిప్రసాద్, శ్రీధర్, శ్రీను, సతీశ్, నరేందర్, కిరణ్ పాల్గొన్నారు.

చిట్యాల : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉరుమడ్ల గ్రామానికి చెందిన మర్రి శ్రీధర్ కుటుంబ సభ్యులకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమకూర్చిన రూ.10వేలను గ్రామానికి చెందిన నాయకుడు కోనేటి యాదగిరి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జనార్దన్, గోపాల్, లింగయ్య, శ్రీనివాస్, వెంకన్న, శ్రీకాంత్, సత్తయ్య, పరమేశ్ పాల్గొన్నారు.

కనగల్ ఎంపీడీఓ బదిలీ

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 11 : కనగల్ ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డిని సూర్యాపేట జిల్లాకు బదిలీ చేస్తూ ఆదివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన స్థానంలో ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. ఒకటి, రెండు రోజుల్లో నూతన ఎంపీడీఓను నియమించనున్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో డ్రాయింగ్ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్

చిత్రలేఖనంలో చిన్నారుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 11 : ఇటీవల సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ హన్మకొండలో నిర్వహించిన పద్మశ్రీ బ్రహ్మానందం పోర్టయిట్ ఛాలెంజ్ చిత్రకళా పోటీల్లో మిర్యాలగూడకు చెందిన విజయ్ డ్రాయింగ్ క్లాసెస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జూనియర్స్ విభాగంలో కె.లిఖిత, బి.ఉజ్వల, సీహెచ్ శృతికీర్తన, వి.నాగనందిని, కె.రిత్విక్‌రెడ్డి వేసిన చిత్రాలకు సర్టిఫికెట్స్ ఆఫ్ అప్రిషియేషన్స్ లభించాయని డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఇనుగుర్తి విజయ్‌కుమార్ తెలిపారు. పోటీల్లో 332 మంది పాల్గొనగా తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చడం ఆనందంగా ఉందన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సీపీఆర్‌పై అవగాహన

హాలియా, ఫిబ్రవరి 11: స్థానిక ఆదిత్య ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నులక రవీందర్‌రెడ్డి, ఎం.గంగాధర్, మామిడాల వినయ్, గౌతంరెడ్డి, శశాంక్, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ధనుంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామలింగారెడ్డికి మృతికి సంతాపం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 11: మాడ్గుల పల్లి మండలం పాములపహాడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సబ్బు రామలింగారెడ్డి(80)అనారోగ్యంతో శనివారం మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌లోని ఆయన నివాసంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆదివారం రామలింగారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ రాములుగౌడ్, కరీం, యాతం నరేందర్‌రెడ్డి, సైదులు, రాంరెడ్డి, జానయ్య ఉన్నారు.

నాగార్జునసాగర్ అద్భుతమైన పర్యాటక ప్రాంతం

● రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్షన్ అధికారి అబ్దుల్ హమీద్

బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటిస్తున్న రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్షన్ అధికారి అబ్దుల్ హమీద్

నందికొండ, ఫిబ్రవరి 11 : నాగార్జునకొండ, బుద్ధవనం అద్భుతమైన పర్యాటక ప్రాంతమని రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్షన్ అధికారి అబ్దుల్ హమీద్ అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నాగార్జునకొండ, బుద్ధవనాన్ని సందర్శించారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి గౌతమబుద్ధుడి విశేషాలు తెలిపే కట్టడాలు, మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం హిల్‌కాలనీలోని బుద్ధవనంలో బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించి బుద్ధచరితవనం, జాతకపార్కు, ధ్యానమందిరం, అవకాన బుద్ధ, మహాస్థూపంపై శిల్పాలను తిలకించారు. వారి వెంట డిప్యూటీ తాసీల్దార్ శరత్‌చంద్ర, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, గైడ్ సత్యనారాయణ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

● సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

మర్రిగూడ, ఫిబ్రవరి 11 : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మండలంలోని ఖుదాభక్షిపల్లిలో సీపీఐ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారమే పరమావధిగా పనిచేస్తూ డబ్బు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న పార్టీలను యువత బహిష్కరించాలన్నారు. బడుగు, బలహీన వర్గాల పక్షాన పనిచేసే సీపీఐని యువత ఆదరించాలని అన్నారు. హక్కుల సాధన కోసం ఉద్యమించిన నాయకులను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయంగా ఎదుగాలన్నారు. ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఖుదాభక్షిపల్లి గ్రామశాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యదర్శిగా పొట్ట యాదగిరి, సహాయ కార్యదర్శిగా మేతరి యాదయ్య, కార్యవర్గ సభ్యులుగా రాపోతు ముత్తయ్య, ఐతగోని కృష్ణయ్య, అశోక్, యాదగిరి ఎన్నికైనట్లు తెలిపారు. సమావేశంలో మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేశ్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మర్రిగూడ : యరగండ్లపల్లి హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మర్రిగూడ, ఫిబ్రవరి 11 : మండలంలోని యరగండ్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో 1998-99 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు సుధాకర్‌రెడ్డి, పొనుగోటి రవీందర్ రావు, లక్ష్మయ్య, పూర్వ విద్యార్థులు కళ్లెం జైపాల్‌రెడ్డి, జమ్ముల వెంకటేశ్‌గౌడ్, రొక్కం భాస్కర్ రెడ్డి, మెగావత్ లాలూనాయక్, కొట్టం జలంధర్, తొడేటి నాగరాజు, పందుల వెంకటేశ్, సాయికుమార్ పాల్గొన్నారు.

ముసుగోడు : మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ పాఠశాలలో 2006-2007 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు.

గ్రామీణ భారత్ బంద్ వాల్ పోస్టర్ల విడుదల

చిట్యాల : వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

చిట్యాల, ఫిబ్రవరి 11 : కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం చిట్యాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ మాట్లాడుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా నిర్వహిస్తున్న ఈ సమ్మెలో పార్టీలకతీతంగా కార్మిక, రైతు సంఘాల సభ్యులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి శ్రీను, రాచకొండ శ్యాంసుందర్, రుద్రవరం మహేశ్, కడకంచి నర్సింహ, ఐతరాజు గోపాల్, శ్రీను, లింగస్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

హాలియా : సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి అవుట సైదులు కోరారు. ఆదివారం హాలియాలో సమ్మె పోస్టర్ విడుదల చేశారు. బషీర్, వెంకన్న, వెంకటేశ్వర్లు, సురేశ్, వెంకటయ్య, యాదయ్య, సైదిరెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూర్ : సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు కోరారు. ఆదివారం కట్టంగూర్‌లోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామకృష్ణ, శోభారాణి, యాదమ్మ, మంగమ్మ, ఎల్లమ్మ, సరిత, యాదమ్మ, లక్ష్మమ్మ, రామలింగయ్య, ముత్తమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలి

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతి

నకిరేకల్, ఫిబ్రవరి 11 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆరోగ్యమిత్రలు ఆదివారం నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య, నల్లగొండ, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గోలి నాగరాజు, చత్రూనాయక్ మాట్లాడుతూ.. ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించి కనీస వేతనం రూ.35వేలతోపాటు టీఏ, డీఏ కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సైదులు, ఉపాధ్యక్షుడు మేడ గోవర్ధన్, రాష్ట్ర కమిటీ సభ్యులు అలుగుబెల్లి గోవింద్‌రెడ్డి, కంచర్ల నరేశ్‌కుమార్, చెరుకు మల్లయ్య, ఆరోగ్యమిత్రలు దండంపల్లి సైదులు, రమణ పాల్గొన్నారు.

'పిల్లల జాబిల్లి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

వడ్డేపల్లి రచనలు సందేశాత్మకమైనవి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 11 : పట్టణానికి చెందిన ప